క్లుప్తంగా

ఆన్‌లైన్ ద్వారానే ఇసుక విక్రయాలు

అశ్వారావుపేటరూరల్: ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే ఇసుక విక్రయాలు జరుపుకోవాలని స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని నారాయణ పురం గ్రామ పంచాయతీ జగన్నాథపురం వద్ద ఉన్న వాగు దగ్గర తహసీల్దార్ ఆధ్వర్యంలో మన ఇసుక-మన వాహనం ఇసుక ర్యాంపును పున:ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త ఇసుక పాలసీ విధానం వల్ల ఇక నుంచి చౌక ధరకే ఇసుక లభిస్తుందని తెలిపారు. ఈ ర్యాంపులో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేస్తారని తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ట్రాక్టర్‌ల యజమానులకు మాత్రమే అవకాశమని అన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఎస్‌ఆర్‌ఓ రాము పాల్గొన్నారు.

దాడులు ఆపాలి

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు ఎర్రబోడులో నివాసముంటున్న గుత్తికాయ ఆదివాసీలపై అటవీశాఖా దాడులు ఆపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్, అటవీ రేంజ్ కార్యాలయాల ఎదుట గుత్తికోయలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ.. పోడు భూములను వదిలేసి ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని అటవీ అధికారులు గొత్తికోయలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్, రేంజ్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఆందోళనలో వరికూటి వెంకట్రావ్, తోలెం వెంకటేశ్వర్లు, రవ్వ రమేష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ.. వ్యాధి నివారణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కళాశాలలో శాస్త్రీయ రంగోలీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య, డాక్టర్ శ్రీను, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, వీరన్న, కామేశరావు, భాగ్య, సమీరా, పద్మ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి

ములకలపల్లి: ములకలపల్లిలో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ పనులతోపాటు డ్రెయినేజీ కూడా నిర్మించాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ములకలపల్లిలో రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. డ్రెయినేజీ లేకపోవడం వల్ల మురుగునీరంతా రోడ్ల పైకి వచ్చి స్థానికులకు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని డ్రెయినేజీ ఏర్పాటుకు నిధులు వచ్చేలా కృషి చేయాలని కోరారు. రోడ్డు పక్కనే ఉన్న 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను మరో చోటికి మార్చాలని అభ్యర్థించారు. ఈ విషయమై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సొసైటీ డైరెక్టర్ రవికుమార్, సీపీఐ నాయకుడు సాయి పాల్గొన్నారు.

తేగడలో వైద్య శిబిరం

చర్లరూరల్: మండలంలోని తేగడ గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైరల్ జ్వరాలతో పాటు కీళ్ల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న 50 మందికి సత్యనారాయణపురం వైద్యాధికారిని దివ్యనయన వైద్య చికిత్స అందిచారు. అందులో ఐదుగురికి జ్వరాలు వచ్చి తగ్గడంతో వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీయంఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెచ్‌ఈఓ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్లు వేణు, రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు దేవయాని, రాంబాబు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

దుమ్ముగూడెం: మండలంలో ఉపాధి హామీ కూలీలకు పెం ఉన్న కూలీ డబ్బులను వెంటనే కూలీల ఖాతాలో జమ చేయాలని ఆదివాసీక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు దొర డిమాండ్ చేశారు. శనివారం అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అధికారులు కూలీల ఖాతాలో నగదు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తెల్లం వెంకటేష్, దుర్గారావు, తాటి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

అశ్వారావుపేటరూరల్: పారిశ్రామిక కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, దుకాణాల్లో పని చేసే కార్మికులతో మిగిలిన అన్ని రంగాల్లోని కార్మికుల వేతనాలను పెరిగిన ధరల ప్రకారం పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. శనివారం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేటలో కార్మికులతో సంతకాలు సేకరించి, కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. హమాలీ యూనియన్ బాధ్యులు నాగేంద్ర, రమేష్, ఖాసీం, రాంబాబు, ముత్తు, అనీల్, శ్రీను పాల్గొన్నారు.

సంప్రదాయినీ.. 'మోదుగు' రంగు!

- ఆ చెట్టు పూలతో హోలీ రంగుల తయారీ
- ఏజెన్సీలో అనాదిగా వస్తున్న ఆచారం
- సంబురాలకు సిద్ధమవుతున్న ఏజెన్సీ వాసులు



ఆంజనేయపురం-తిమ్మిరిగూడెం గ్రామాల సమీపంలో విరబూసిన మోదుగుపూలు

సండే స్పెషల్

చర్ల: ఏజెన్సీ వాసులు సంప్రదాయబద్ధమైన రంగులతో హోలీ పండుగను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఏజెన్సీలో ప్రజలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రకృతితో ఎంతో కొంత అవినాభావ సంబందం ఉంటూనే ఉంటుంది. అదే క్రమంలో హోలీ పండుగతో కూడా ఏజెన్సీ వాసులకు ప్రత్యేక అనుభందం నెలకొంది. ఏజెన్సీలో కొందరు బయట మార్కెట్లో దొరికే రంగులను వాడుకంటూ ఉండగా మారుమూల గ్రామాలు, ఆదివాసీ గూడేల్లో మాత్రం హోలీ పండుగ సందర్భంగా మోదుగు పూలతో తయారు చేసిన రంగులను మాత్రమే హోలీ పండుగ నాడు ఉపయోగిస్తూ సంబరాలు జరుపుకుంటూ వస్తున్నారు.

ఏజెన్సీలోని అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రస్తుతం ఎక్కడ చూసినా మోదుగు పూలే కనిపిస్తున్నాయి. వాగులు, చెరువులు, కుంటల వద్ద అటవీ ప్రాంతాల్లోనూ మోదుగు చెట్లు దర్శమిస్తుండగా, వాటికి పూల విరగబూశాయి. మరో రెండు రోజుల్లో హోలీ పండుగ రానుండగా ఏజెన్సీలో విరగబూసిన మోదుగుపూలతో రంగులు తయారు చేసుకునేందుకు ఏజెన్సీలో యువతీ యువకులు, చిన్నారులు సిద్ధమవుతున్నారు.

తయారీ ఇలా..

హోలీ పండుగకు ఒక రోజు ముందే చెట్లకు ఉన్న మోదుగు పూలను తెంచుకొచ్చి వాటిని నీళ్లలో వేసి రాత్రంతా నానబెడతారు. హోలీ నాడు ఉదయం నీళ్లల్లో నానిన పూలను తీసి రోట్లో వేసి బాగా దంచి దానితో రసం తయారు చేస్తారు. దీనిని పాత్రలలో ఎత్తుకొని బాటిళ్లలో నింపి హోలీ వేడుకలలో వాడుకుంటున్నారు.

అనాదిగా ఆచారం..

ఏజెన్సీలో మోదుగు పూలతో రంగులు తయారు చేసుకొని హోలీ పండుగలో చల్లుకోవడం ఏజెన్సీలో అనాదిగా వస్తోంది. ఎటువంటి ఖర్చు లేకుండా సాంప్రదాయ బద్ధమైన రంగులు తయారు చేసుకోవడం, చల్లుకోవడం, ఆరోగ్యపరమై ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణాలు, మండ కేంద్రాలు మినహా మిగిలిన గ్రామాలు ఆదివాసీ పల్లెల్లో నేటికీ మోదుగు పూలతో తయారు చేసిన సాంప్రదాయబద్ధమైన రంగులతోనే హోలీ పండుగను జరుపుకుంటూ వస్తున్నారు.

ఏళ్ల నుంచి జరుపుకుంటున్నాం..



మోదుగు పూలతో రంగులు తయారు చేసి హోలీ పండుగ నాడు చల్లుకోవడం ఏళ్ల తరబడిగా వస్తోంది. పైసా ఖర్చు లేకుండా రంగులు సమకూర్చుకోవడం, ఎటువంటి అనారోగ్యపరమైన ఇబ్బందులు కలుగకుండా ఉండడంతో హోలీ రోజు మోదుగు పూలతో తయారు చేసిన రంగులను వాడుకుంటున్నాం.

– పి.రాము, చర్ల

సంప్రదాయాన్ని మరచిపోకూడదు..



సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారాలను మరచిపోగూడదు. ఏజెన్సీ సాంప్రదాయాల్లో మోదుగు పూలకు ప్రత్యేకత ఉంది. మోదుగు చెట్టు ద్రౌపతి చేత పునీతమైన చెట్టని ప్రతీక ఉంది. అందుకే మోదుగు పూలతో తయారు చేసిన రంగులతోనే పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– ఎస్.నాని, చర్ల

హోలీ చెక్ పోస్టులు!



భట్టుపల్లి వద్ద వాహనాలు ఆపి డబ్బులు తీసుకుంటున్న చిన్నారులు

కరకగూడెం: హోలీ పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలు, పెద్దలు తెల్సినవారి నుంచి ఎంతో కొంత డబ్బులు ఆత్మీయంగా వసూలు చేసుకుంటూ పండుగను మరింత ఆనందంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బృందాలుగా ఏర్పడి కరకగూడెం మండల కేంద్రంలోని పరిచయం ఉన్న దుకాణదారులు, రాజకీయ నాయకులు, అధికారులు పలువురి నుంచి పండుగ మామూళ్లుగా స్నేహపూర్వకంగా వసూలు చేస్తున్నారు.

మరికొన్ని చోట్ల చిన్నారులతో కలసి వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రధాన రహదారిపై వాహనాలను చెక్ పోస్ట్ మాదిరిగా అందుబాటులో ఉన్న తాడు లేదా వాటర్ పైపులను అడ్డంగా ఉంచి వాటిని ఆపి పండుగ సందర్భంగా డబ్బులు అడుగుతున్నారు. దీంతో పలువురు వారికి డబ్బులు ఇచ్చి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అదేవిధంగా ఏజెన్సీ గ్రామాల్లో సాయంత్రం వేళల్లో పిల్లలు పాటలు పాడుతూ జాజిరి ఆడుతూ సందడి చేస్తున్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో శనివారం బంధించింది.

కల్యాణానికి ముమ్మర ఏర్పాట్లు

బూర్గంపాడు: పవిత్ర గోదావరి నదీతీరంలోని ఇరవెండి సంతాన వేణుగోపాలస్వామి కల్యాణానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 25వ తేదీన రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం జరగనుంది. చోళుల కాలంనాటి పురాతన సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం రోజున గరుడ ముద్దల పంపిణీ చేస్తారు. సంతానం లేనివారు ఈ గరుడు ముద్దలు స్వీకరిస్తే సంతానం కలుగుతుందని ఈ ప్రాంత ప్రజలు విశ్వాసం. పూర్వం ఈ ఆలయంలో స్వామివారికి వెండిపూలతో పూజించేవారని చెబుతుంటారు. అందుకే ఈ గ్రామానికి విరివెండిగా పేరువచ్చిందని, కాలక్రమంలో ఇరవెండిగా మారిందని స్థానికులు చెబుతుంటారు. ఈ ఆలయం ఎదుట అష్టభుజ సత్తెమ్మ తల్లి విగ్రహం ఉంది. పూర్వం ఈ ఆలయానికి సత్తెమ్మ తల్లి రక్షణగా ఉండేదని పూర్వీకులు చెబుతుంటారు. హోలీ పండుగ రోజున జరిగే స్వామివారి కల్యాణానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం స్వామివారి మేలుకొలుపు, అభిషేకాలు, అర్జిత సేవలు కొనసాగనున్నాయి. కల్యాణం అనంతరం అన్న సమారాధన కార్యక్రమం కొనసాగనుంది.

ఆదరణ ఓర్వలేకే ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం ఇచ్చిన హామీల అమలుకు చేస్తున్న కృషికి ఆదరణను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అవాకులు చవాకులు పేల్చుతున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ అన్నారు. శనివారం అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేసి, అభివృద్ధి అంటూ బీఆర్‌ఎస్ నాయకులు అరాచకం సృష్టించారని ధ్వజమెత్తారు. త్వరలో బీఆర్‌ఎస్ నాయకుల అరాచకాల చిట్టాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను దొంగవంటూ రేగా కాంతారావుకు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివ, సీనియర్ నాయకులు పాలమూరి రాజు, సామా శ్రీనివాస రెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, జీవరత్నం, గాండ్ల సురేశ్, సుబ్బారెడ్డి, త్రిమూర్తులు, బీసీ సెల్ నాయకులు పెనుగొండ సాంబశివరావు, సోమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జైలు జీవితంతో పరివర్తన రావాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సూరిరెడ్డి

భద్రాచలంటౌన్: అనుకోని ఘటనలతో నిందితులుగా తేలిన వ్యక్తులు జైలు జీవితం నుంచి బయటకు వచ్చిన తరువాత మార్పు వచ్చేలా పరివర్తన ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కె.సూరిరెడ్డి అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను ఆయన శుక్రవారం సందర్శించి ముద్దాయిలకు అందుతున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జైలు జీవితం గడుపుతున్న ముద్దాయిలు ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్, లీగల్ సర్వీసెస్ పానల్ న్యాయవాదులు శారద, రమణ, వెంకటేశ్వర్లు, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరబాబు

అశ్వారావుపేట: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శనివారం స్థానిక కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ రిటైర్డ్ డీఎం, ఇంపాక్ట్ ఫౌండేషన్‌కు చెందిన జవ్వాది వెంకటేశ్వరబాబు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు వివరించారు. ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు ప్రమాదాలు జరుగడానికి కారణాలు, వాటి నివారణా మార్గాలను వివరించారు. అధికారిక లెక్కల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు 80 శాతం మానవ తప్పిదాలే కారణమన్నారు. ప్రాణం పోసే శక్తి మనకు లేనపుడు ప్రాణం తీసే హక్కు మనకు లేదని అన్నారు. విద్యార్థులంతా ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలు లేని సమాజాన్ని సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కళాశాల ఇన్నోవేషన్ క్లబ్ ఇన్‌చార్జ్ ఇందూరపల్లి కృష్ణతేజ, టాక్ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ సమన్వయంతో ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

కేసు నమోదు

బూర్గంపాడు: కులాంతర వివాహం చేసుకున్న తనపై తండ్రి దాడికి పాల్పడ్డాడని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో పలువురు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన కిషోర్, ముష్టిబండ గ్రామానికి చెందిన టి.ప్రసాద్ కలిసి అశ్వారావుపేట మండలంలోని నారాయణపురంలో శుక్రవారం రాత్రి జరిగిన ఓ వివాహ వేడుకకు వచ్చారు. అనంతరం తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలోని వినాయకపురం వద్ద ఎదురుగా వచ్చిన పాల్వంచకు చెందిన అన్వర్ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దాంతో ఈ ప్రమాదంలో కిషోర్, ప్రసాద్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికు తరలించగా తీవ్రంగా గాయపడిన కిషోర్‌కు వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఈ ప్రమాదంపై ప్రసాద్ చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టి..

అశ్వారావుపేటరూరల్: ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం పాలకొల్లుకు చెందిన విశ్వనాథం, నాగరాజు అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేటకు వస్తున్న కమంలో మార్గమధ్యలోని కాకతీయ గేటు వద్ద డివైడర్‌ను అదుపుతప్పి ఢీ కొట్టారు. దాంతో ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికు తరలించారు. ఆస్పత్రి వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికు తరలించారు.

పిల్లలకు టీకాలు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామశివారు మంగళిబోడులో గొత్తికోయ పిల్లలకు శనివారం ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వ్యాధినిరోధక టీకాలు వేశారు. గుత్తికోయ ఆదివాసీల్లో కుష్టువ్యాధి లక్షణాలపై పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ ప్రియాంక, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌ఈఓ శారారాణి, సిబ్బంది సుశీల, రాందాస్, హారిక, ఆశావర్కర్లు రాములమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

మాస్‌లైన్‌లో చేరిక

దమ్మపేట: మండల కేంద్రంలోని అర్బన్ కాలనీ, మల్లారం కాలనీల నుంచి వివిధ పార్టీలకు చెందిన 50 మంది సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలో చేరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో జిల్లా నాయకులు కెచ్చెల రంగారెడ్డి పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో బాబ్జి, చాట్ల నాగేశ్వరరావు, తాటి లక్ష్మి, నరహరి, గంగాధర సాయి తదితరులు ఉన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు ఘనంగా నివాళులర్పించారు. ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, కల్లూరి కిషోర్, తోడెం దుర్గమ్మ, వీరబాబు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధించాలి



ములకలపల్లి: భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కళాకారులు

ములకలపల్లి: అమరవీరుల ఆశయాలు సాధించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్ పిలుపునిచ్చారు. పీవైఎల్ డివిజన్ నాయకులు కుర్సం ముఖేశ్ ఆధ్వర్యంలో పీవైఎస్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తిమ్మంపేటలో శనివారం నిర్వహించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాల వేసి, విప్లవ జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కళాప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, పీవైఎల్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి కొర్సా రామకృష్ణ, పార్టీ మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ తిమ్మంపేట ఎంపీటీసీ నూపా సరోజిని తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

చంద్రుగొండ: దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌లకు భారతరత్న అవార్డులతో సత్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రం చంద్రుగొండలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్రం కోసం భగత్‌సింగ్ ప్రాణత్యాగాన్ని శ్లాఘించారు. ఆయనకు జోహార్లు అర్పించారు. రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాము, కె.కాంతారావు, రాజా, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

అమ్మవారి తిరునాళ్లు ప్రారంభం

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామ శివారులో వెంచేసియున్న జగదాంబ అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలు, మొద్దులగూడెం గ్రామ శివారులో ఉన్న ఏకుల పోతమ్మ తల్లి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునాళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని నాచారంలో జగదాంబ అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంగళ తోరణం, గణపతి పూజ, కలశస్థాపన, కుంకుమార్చన తదితర విశేష పూజలను నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మొద్దులగూడెంలోని ఏకుల పోతమ్మ తల్లి ఆలయంలో కలశస్థాపన, అఖండ ప్రజ్వలన, తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

అమ్మవార్లను దర్శనం కొరకు విచ్చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించడబతాయని కమిటీ సభ్యులు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మణుగూరుటౌన్: ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ అహర్నిశలు కృషి చేస్తుందని ఆ యూనియన్ ప్రతినిధులు బాపనపల్లి మహేశ్, కర్రీ నగేశ్‌లు అన్నారు. శనివారం ఓసీ-4 దుర్గా కంపెనీ గేట్ మీటింగ్‌లో కార్మికులను ద్దేశించి వారు మాట్లాడారు. మూడు కంపెనీలతో జీతాల అగ్రిమెంట్ విషయం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లి జీతాల అగ్రిమెంట్ డిమాండ్ నోటీసును అందించామన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జీతాల పెరుగుదల, అగ్రిమెంట్ చేయడంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీనిచ్చారన్నారు. అనంతరం కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులపై మెనేజ్‌మెంట్ చిన్నచూపు, గ్యారేజీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల యూనియన్ నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో నేల కుమారస్వామి, సంపత్ కుమార్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి



చంద్రుగొండ: గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమంలో శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా సీడీపీఓ, సూపర్‌వైజర్లు ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: పోషణ్ పక్వాడా ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



దుమ్ముగూడెం: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ముందస్తు హోలీ వేడుకలు

హోలీ పండుగ సమీపించిన నేపథ్యంలో పలు విద్యా సంస్థల్లో శనివారమే ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమాల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు. ఉత్సాహంగా సంబురాలు చేసుకున్నారు. కుల, మత, వర్గ విభేదాలకు తావు లేకుండా చేసుకునే పండుగ హోలీ అని, మన సంస్కృతి, సంప్రదాయాలను ఇది చాటి చెబుతుందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: హోలీ వేడుకలు జరుపుకుంటున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



ములకలపల్లి: తిమ్మంపేట పాఠశాలలో హోలీ ఆడుతున్న దృశ్యం



మణుగూరురూరల్: రంగులు పూసుకుంటూ సందడి చేస్తున్న 'ఎక్సలెంట్' విద్యార్థులు